క్లుప్తంగా

అన్నసమారాధన



వెంకటగిరిలో భోజనం చేస్తున్న వృద్ధులు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధి వెంకటగిరిలోని రిమ్మలపూడి సుబ్బరాజు ఇంటి దగ్గర జనకళ్యాణ్ భారతి ట్రస్టు సహకారంతో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. హుకుంపేట, జైహింద్ నగర్, వెంకటగిరి, బాపూజీ నగర్, గంగిరెడ్డులపేటలలో ఉన్న వృద్ధులకు ప్రతి శుక్రవారం ఇక్కడ అన్నదానం చేస్తున్నట్టు ట్రస్ట్ అధ్యక్షుడు రిమ్మలపూడి శ్రీసూర్యరాజ్ కుమార్ తెలిపారు. దసరా నుంచి ఈ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోందన్నారు. గ్రామ పెద్దలు ఈరంకి ఆనందమూర్తి, గారపాటి అమర్నాథ్, రిమ్మలపూడి సుబ్బరాజు, తనుబుద్ధి సూర్యభాస్కర్, రామోజు గౌరీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీటీఆర్ఐ: చెట్ల కొమ్మల తొలగింపు, ఎర్రకొండ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కోసం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. రెవెన్యూ కాలనీ, రాజీవ్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, పాలిటెక్నిక్ కాలేజీ, గాయత్రీ నగర్, ఎంప్లాయీస్ కాలనీ, రాజవోలు గ్రామాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా ఉండదన్నారు.

నేడు క్రిస్మస్ వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలోని రమాదేవి గార్డెన్స్‌లో శనివారం సాయంత్రం ఆరు గంటలకు క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఎంప్లాయీస్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫెడరేషన్ (న్యూఢిల్లీ), ఏపీ ప్రేయర్ టీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ విషయాన్ని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ చింతా సురేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఎల్షడాయి చర్చికి చెందిన పాస్టర్ ఎంఎస్ సునీల్ వర్ధన్ క్రిస్మస్ సందేశాన్ని అందిస్తారు.

ఘనంగా స్త్రీల క్రిస్మస్

కడియం: జేగురుపాడులోని బైబిల్ మిషన్ చర్చి వద్ద బెత్లెహేమ్ స్త్రీల క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. సిస్టర్ విజయ జాన్సన్ వాక్యోపదేశం చేశారు. పాస్టర్ మోడీ శుభాలు అందించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో సంఘ కాపరి మహిమ రాజు శాంత కుమారి ఆధ్వర్యంలో నాటికలు, బైబిల్ వాక్యాలు ఆకట్టుకున్నాయి. గత ఆరేళ్లుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్న స్త్రీలను వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, మాజీ సర్పంచ్ దేవదీవెన కుమారి అభినందించారు. కార్యక్రమంలో ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షుడు సాక కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ ఫుట్‌బాల్ పురుషుల విభాగం పోటీలు శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో వివిధ కళాశాలలకు చెందిన ఆరు జట్లు పాల్గొన్నాయి. ఏకేఎన్‌యూ ప్రొఫెసర్ జి.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, ముళ్ల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల వితరణ

ప్రకాశం నగర్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ట్స్ కళాశాల వాలీబాల్ జట్టుకు కిట్లను వితరణ చేశారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రమోద్ కుమార్ మిశ్రా, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యశ్వంత్, శేషుకుమార్ పాల్గొన్నారు.

హజరత్ ఖకార్ష ఉరుసు ప్రారంభం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని గూడ్స్ షెడ్ వద్ద ఉన్న హజరత్ ఖకార్ష ఖాదరి ఔలియా ఉరుసు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. దర్గా ఆర్గనైజర్, ముజావర్ షేక్ అల్లా బక్షీ, ముజావర్లు షేక్ మదీనా పాషా, షేక్ ఖాదర్ హుస్సేన్ ఆధ్వర్యంలో గ్యార్మి ఫాతిహా అనంతరం పన్నీరు స్నానం నిర్వహించారు. శనివారం ఉదయం 8 గంటలకు ఖురాన్ పఠనం ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని షేక్ అల్లాబక్షీ కోరారు.

బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో ఎక్సైజ్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి సీహెచ్ లావణ్య ఆదేశాల మేరకు శుక్రవారం రాజానగరం మండలం చక్రద్వారబంధం ఫారెస్టు ఏరియాలో ఎక్సైజ్ రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 1900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

కరాటేలో అదరహో..

- సత్తా చాటుతున్న విద్యార్థులు
- పలు పోటీలలో పతకాల కైవసం
- చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి



కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు భరత్ శర్మ చేతుల మీదుగా పతకాలు అందుకుంటున్న క్రీడాకారులు

ప్రకాశం నగర్: కరాటేపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతోంది. ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా మరికొందరు దీనిలో శిక్షణ పొందుతున్నారు. క్రమశిక్షణతో ఈ విద్యను నేర్చుకుని పలు పోటీలలో పతకాలు సాధిస్తున్నారు. చదువులో పాటు కరాటేలోనూ ప్రతిభ చూపుతూ ఎందరికో ఈ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరంలో విద్యార్థులు చదువుతో పాటు వివిధ క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. వీరిలో ప్రభుత్వ, పాఠశాలలు, కళాశాలలకు చెందిన వారు ఎక్కువగా ఉండడం విశేషం. కేవలం క్రీడలపై తమకున్న ఆసక్తితో ప్రతిభకు పదును పెట్టుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయ కేతనం ఎగుర వేస్తున్నారు.

పతకాల వెల్లువ

ఢిల్లీలోని కటోరా ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన క్రీడాకారులు వెండి, కాంస్య పతకాలు సాధించారు. వీరిలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన పి.విజయ్ వెండి పతకం సాధించగా, లాస్లేట్ స్కూల్ విద్యార్థి కె.జాక్సన్, ధవళేశ్వరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.నవ్యశ్రీ, లాలాచెరువు మున్సిపల్ స్కూల్‌కు చెందిన పి.సత్య వెంకట శ్రీరామ్, శ్రీసునంద, పి.పూజ, శ్రీలక్ష్మీభవాని, వి.వెంకట కిరణ్మయి కాంస్య పతకాలను గెలుచుకున్నారు. వీరికి కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు భరత్ శర్మ బహుమతులు అందజేశారు.

సహకారం అందిస్తే..

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తే మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉంటుందని కోచ్‌లు చెబుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడలను ప్రోత్సహించేందుకు పలు పోటీలను నిర్వహించారు. క్రీడాకారులకు కిట్లను అందించడంతో పాటు విజేతలకు నగదు బహుమతులను పంపిణీ చేశారు. ప్రస్తుతం విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆయా పీడీలు కృషి చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం సహకారం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. క్రీడా పోటీలకు నిధుల లేమి కారణంగా విద్యార్థులు చదువుకు మాత్రమే పరిమితమవుతున్నారు.

ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు



"ప్రభుత్వం కరాటే క్రీడాకారులను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో రాష్ట్రానికి మంచి పేరు తీసుకువస్తారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మంచి శిక్షణ ఇస్తే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తారు."

– పిల్లి అరుణ్ కుమార్, కరాటే మాస్టార్

రైటర్లకు రెండు రోజుల శిక్షణ



శిక్షణకు హాజరైన వారితో పోలీసు అధికారులు

కంబాలచెరువు: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు, అసిస్టెంట్ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎంబీఎన్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పీజీఆర్ఎస్, సీసీటీఎన్ఎస్ అప్‌డేషన్, అఫెండర్ సర్వలెన్స్, చాట్ జీపీ, పోలీసులు ఉపయోగించే ఇతర అప్లికేషన్లపై అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణకు 45 మంది హాజరయ్యారు.

మెగా పేరెంట్ మీటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలోని పాఠశాలల్లో శనివారం జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవ రావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపించామన్నారు. అలాగే పాఠశాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాల వివరాలను ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేశామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి అర్బన్‌లోని ఏదో ఒక పాఠశాలలో జరిగే మెగా పేరెంట్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో ఈ మెగా పేరెంట్ మీటింగ్‌ను విజయవంతం చేయాలన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



హుకుంపేటలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని ప్రత్యక్ష నాగ దేవత ఆలయం (పాముల గుడి)లో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శుక్రవారం వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు బాపిరాజు శర్మ పర్యవేక్షణలో ఆలయ నిర్వాహకులు సింగి గంగాధర్, సింగిడి గంగరాజు, పైడిరాజు దంపతులు పీటలపై కూర్చున్నారు. వీరితో పాటు అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

కన్నుల పండువగా కల్యాణం

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఏటా సుబ్రహ్మణ్య షష్ఠి ముందు స్వామివారి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిపించారు. గిరజాల వెంకటసూర్య ప్రభాకర్, సత్య శ్యామల దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ తంతు నిర్వహించారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే జనార్దనస్వామి ఆలయంలో మైలవరం రాంబాబు దంపతులతో వేద పండితులు వేదాంతం జగన్నాథాచార్యులు, కృష్ణమాచార్యుల పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా కల్యాణం జరిగింది. కాగా.. శనివారం జరిగే షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆలయాలను ముస్తాబు చేశారు.

ముగిసిన వివేకామృతం వేడుకలు

బిక్కవోలు: మండలంలో వారం రోజులుగా బలభద్రపురం గ్రామంలోని ట్రూత్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, ఆత్మ జ్ఞాన ప్రబోధకుడు వివేకానంద ఆధ్వర్యంలో జరుగుతున్న ట్రూత్ వివేకామృతం విజయోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఆత్మజ్యోతికి ప్రతీకగా ఆకాశ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ, ఆధ్యాత్మికంగా సమాజంలో ఎలా మెలగాలి, పెద్దలతో వినయవిధేయతలు ఎలా కనబర్చాలనే వాటిని వివరించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



క్విజ్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానం పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. రిలయన్స్ ఫౌండర్ చైర్మన్ ధీరుబాయ్ అంబానీ జయంతి సందర్భంగా శుక్రవారం వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుత పోటీ సమాజంలో ప్రతి విద్యార్థి అన్ని రంగాలలో విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. 12 ఏళ్లుగా ధీరూబాయ్ అంబానీ పేరు మీద సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలోని 160 ఉన్నత పాఠశాలలకు చెందిన 640 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డీఈవో ప్రదానం చేశారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు బస్ చార్జీలు అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ ప్రతినిధులు ఆపరేషన్స్ హెడ్ ప్రవీణ్ నందగిరి, సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక కల్యాణ మండపాలు నిర్మించాలి



ఆర్డీఓ కృష్ణ నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘు సభ్యులు

సీటీఆర్ఐ: రానున్న గోదావరి పుష్కరాలకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే బీసీ ఎస్సీల యాత్రికుల సౌకర్యార్థం రాజమహేంద్రవరంలోని ప్రతి బీసీ, ఎస్సీ కులాలకు ప్రత్యేక కల్యాణ మండపాలను ప్రభుత్వం నిర్మించాలని రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ ఈ కల్యాణ మండపాల కోసం స్థల సేకరణ, నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పుష్కరాలకు నగరానికి సుమారు పది కోట్ల మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీరిలో చాలా మంది స్థానికంగా ఉన్న బంధువుల ఇళ్లలో బస చేస్తారన్నారు. వారందరికీ వసతి సదుపాయం కల్పించాలంటే ఆయా ప్రాంతాల్లో సామాజిక కల్యాణ మండపాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్డీవో కృష్ణ నాయక్ మాట్లాడుతూ నగరంలో అందుకు అనువుగా ఉన్న ప్రభుత్వ స్థలాలు గుర్తించి చెబితే ప్రభుత్వానికి తెలియచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, సభ్యులు బత్తిన ఏడుకొండలు బొక్కా సత్య వెంకట ప్రతాప్, మట్టపర్తి సత్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	పుష్ప-2
సూర్యమినీ	:	పుష్ప-2
సూర్యప్యాలెస్	:	పుష్ప-2
శివజ్యోతి	:	పుష్ప-2
అనుశ్రీ	:	పుష్ప-2
స్వామి	:	పుష్ప-2
అశోక	:	పుష్ప-2
రాజా	:	పుష్ప-2
రంభ	:	పుష్ప-2
ఊర్వశి	:	పుష్ప-2
మేనక	:	పుష్ప-2
కుమారి	:	పుష్ప-2
అప్సర	:	పుష్ప-2
నామవరం		
వీఎస్ మహల్	:	పుష్ప-2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	పుష్ప-2
కడియం		
వెంకటసూర్య	:	పుష్ప-2

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

- మాజీ ఎంపీ భరత్‌రామ్
- బాబా సాహెబ్‌కు వాడవాడలా నివాళి

సీటీఆర్ఐ: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘించి అమాయకులపై అక్రమ కేసులు బనాయించి, వారిపై దాడులు చేయిస్తోందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో దళిత యువకుడిపై దాడి చేసి అమానుషంగా ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు. ఈ సంఘటనపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: క్వారీ కెనాల్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గూటం రాజు, నంబూరి రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. బోడపాటి కుమార్, గోలి దేవకుమార్, రేగుళ్ల రాజు, పసుపులేటి దేవి, గునిపే కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- లాక్‌లైన్ క్వార్టర్ల వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఇరిగేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్‌వీ రాజేష్ రావు, జేఈ రాధాకృష్ణ, సాయిరామ్, ఎన్జీవో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జై కుమార్, లక్ష్మణ్, ఎన్‌వీ రమణ, కాటన్, వాసవి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

దేశానికి దిక్సూచి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలో అంబేడ్కర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కా విజయకుమార్, సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి అన్నారు.

- బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ ఏ.గురుబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఈలు శ్రీధర్, విజయకుమార్, అకౌంట్స్ ఆఫీసర్ పీఎస్ బాలసుబ్రహ్మణ్యం, జేఏవో రమణ, ఏడీఈలు రాయుడు రమేష్‌బాబు, జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.
- బొమ్మూరు సెంటర్‌లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్, టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్.. అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కొంతమూరులో దండమూడి ప్రసాద్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్.. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. జేగురుపాడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ స్టాలిన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి వీర శివాజీ, పాలపర్తి ప్రకాష్ కుమార్, ఫిషర్ మెన్ సొసైటీ ప్రెసిడెంట్ సాకా కిరణ్, మాజీ ప్రెసిడెంట్ బళ్ల అన్నవరం, అంబేడ్కర్ యువజన విభాగం నాయకుడు మద్దుకూరి గోపీ తదితరులు పాల్గొన్నారు.

- పొట్టిలంకలో అంబేడ్కర్ యువజన సంఘం, జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని రెండు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.



ధవళేశ్వరం క్వారీ కెనాల్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు తదితరులు

- అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బహుజన సమాజ్ పార్టీ రూరల్ నాయకులు పల్లి అబ్బులు, సబ్బితి అబ్బులు (మాస్టారు) అన్నారు. కడియపులంకలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- తన జీవిత సర్వస్వాన్ని దేశం కోసం త్యాగం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అన్నారు. ఆ పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆర్టీఏ జిల్లా కన్వీనర్ దామిశెట్టి నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా ఖ్యాతి గాంచి, భారత రాజ్యాంగాన్ని రచించి మనకందించిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి సత్యనారాయణ ఆలపించిన అంబేడ్కర్ గేయం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ ఉపాధ్యక్షుడు నరమామిడి విష్ణు, ఉండమట్ల ప్రభాకర్, నరమామిడి సాయిరాం, ఉపాధ్యాయులు సువర్ణవేణి, శరత్ బాబు పాల్గొన్నారు.



ధవళేశ్వరం లాక్‌లైన్ క్వార్టర్స్‌లో నివాళులర్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్‌రావు, ఉద్యోగ సంఘు నాయకులు



బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ గురుబాబు, ఉద్యోగులు



హుకుంపేటలో అంబేడ్కర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



పొట్టిలంకలో అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు



జేగురుపాడులో మాట్లాడుతున్న సర్పంచ్ స్టాలిన్



కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..